అకాల వర్షం..అపార నష్టం

- జిల్లాలోని ఆరు మండలాల్లో దెబ్బ తిన్న పంటలు
- 714 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు అధికారిక లెక్కలు
- అంతకంటే ఎక్కువగానే దెబ్బ తిన్న పంటలు,
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న రైతులు

సిర్గాపూర్ మండలం లక్ష్మణ్‌నాయక్ తండాలో వర్షాలతో దెబ్బతిన్న జొన్నపంటను చూపుతున్న రైతు గంగారాం రాథోడ్

సంగారెడ్డి మార్చి 19(నమస్తే తెలంగాణ): జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు రైతులకు తీవ్ర పంట నష్టం మిగిల్చాయి. కరెంటు కోతలు, సాగునీరు లేక ఇబ్బంది పడుతున్న రైతులకు అకాల వర్షాలు శాపంగా మారాయి. వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం సంగారెడ్డి జిల్లాలో 714 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి.

అయితే రైతులు చెబుతున్న సమాచారం మేరకు వెయ్యి ఎకరాలకుపైగా విస్తీర్ణంలో పంట నష్టం వాటిల్లింది. వర్షాలతో జొన్న, మొక్కజొన్న పంటలతోపాటు ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయి. అత్యధికంగా మామిడి రైతులు ఎక్కువగా నష్టం చవిచూశారు.

714 ఎకరాల్లో పంటనష్టం

వ్యవసాయశాఖ అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో 714 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్, నారాయణఖేడ్ నియోజకవర్గాల్లో అకాల వర్షాలు కురవడంతోపాటు వడగండ్ల వాన కురిసింది.

జహీరాబాద్, మొగుడంపల్లి, ఝరాసంగం, కంగ్టి, మనూరు, న్యాల్‌కల్ మండలాల్లోని 30 గ్రామాల్లో వర్షం, వడగండ్ల వానల కారణంగా పంటలు దెబ్బతిన్నాయి. 343 మంది రైతులకు చెందిన 714 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. 237 మంది రైతులకు చెందిన 180 ఎకరాల్లో జొన్న, 29 మంది రైతులకు చెందిన 48 ఎకరాల్లో మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. అలాగే 74 మంది రైతులకు చెందిన 479 ఎకరాల్లో మామిడి పంట దెబ్బతిన్నది. వడగండ్ల వానకు తోడు ఈదురుగాలులు వీయటంతో మామిడి కాయలు నేలరాలి మామిడి రైతులు తీవ్ర నష్టం చవిచూశారు. ఇద్దరు రైతులకు చెందిన నాలుగు ఎకరాల బొప్పాయి తోట, ఒక రైతుకు చెందిన మూడు ఎకరాల అరటి తోట అకాల వర్షాలకు దెబ్బతిన్నాయి. అధికారిక లెక్కల ప్రచారం 714ఎకరాల్లో పంటనష్టం వాటిల్లినట్లు చెబుతున్నప్పటికీ జిల్లాలో వెయ్యి ఎకరాలకు పైగా పంటనష్టం జరిగింది.

పంట నష్టపోయిన రైతులకు అండగా కేసీఆర్ సర్కార్

కేసీఆర్ సర్కార్ తొమ్మిదిన్నరేండ్ల పాలనలో రైతు వెన్నంటే నడిచింది. పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి అండగా నిలిచింది. దేశంలో ఎక్కడా లేనివిధంగా కేసీఆర్ ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10,000 చొప్పున పరిహారం చెల్లించింది. ప్రస్తుతం పంటనష్టం చవిచూసిన రైతులు కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారు. కేసీఆర్ తరహాలోనే కాంగ్రెస్ ప్రభుత్వం తమకు పరిహారం అందజేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

ఈదురుగాలులకుతోడు వడగళ్ల వాన కురవడంతో మామిడి కాయలు నేలరాలాయి. దీంతో మామిడి రైతులకు నష్టం ఎక్కువ జరిగింది. అకాల వర్షాలతో సంగారెడ్డి జిల్లాలో జొన్న, మొక్కజొన్న పంట లు దెబ్బతిన్నాయి. అలాగే బొప్పాయి, అరటితోటలు దెబ్బతిన్నాయి. పంటనష్టపోయిన రైతులు ప్రభుత్వం పంట నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు

న్యాల్‌కల్, మార్చి 19: మండలంలోని ముంగి గ్రామ శివారులోని అల్లాదుర్గం-మెటల్‌కుంట రోడ్డు మార్గంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులకు గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. పదోతరగతి పరీక్షలు రాసేందుకు హద్నూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రానికి విద్యార్థులు బైక్‌పై వెళ్తున్నారు. ముంగి గ్రామ సమీపంలోని ఎస్ఎల్ఆర్ ఫంక్షన్ హాల్ ఎదురుగా డీసీఎంను ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించుకునే ప్రయత్నంలో అదుపుతప్పి పడిపోయారు. ఈ ఘటనలో చినిగేపల్లి గ్రామానికి చెందిన పెంటప్ప, డప్పూర్‌కు చెందిన అనిల్‌కు గాయాలు కాగా, చినిగేపల్లికి చెందిన మరో విద్యార్థి ప్రశాంత్‌కు తలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని హద్నూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేశారు. ఆనంతరం స్వల్పగాయాలైన విద్యార్థులు పెంటప్ప, అనిల్ పరీక్ష రాసేందుకు వెళ్లారు. తీవ్రగాయాలైన ప్రశాంత్‌ను కుటుంబసభ్యులు మెరుగైన వైద్య కోసం జహీరాబాద్ ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న మండల విద్యాధికారి మారుతీరాథోడ్, హద్నూర్ ఎస్ఐ రామానాయుడు విద్యార్థులను పరామర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు పరీక్షలు రాసేందుకు జాగ్రత్తగా రావాలని, వేగంతో బైక్‌లు నడిపి ప్రమాదాలు తెచ్చుకోవద్దని సూచించారు.

తీవ్రగాయాలైన విద్యార్థి ప్రశాంత్‌ను 108వద్దకు తరలిస్తున్న కుటుంబసభ్యులు

అధికారుల పనితీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

సిర్గాపూర్, మార్చి 19: తహసీల్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతిపై నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం సిర్గాపూర్‌లో జరిగిన మండల సభలో ఆయన రెవెన్యూ అధికారుల పనితీరుపై మండిపడ్డారు. మండలాఫీసులో ఏ పని కావాలన్నా పైసలు ఇస్తేనే పని చేస్తామనడం సరికాదన్నారు. త్వరలో కలెక్టర్‌తో వచ్చి అవినీతిని బయటపెడతానని హెచ్చరించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ అధికారులకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అర్థమయ్యేలా తెలపాలన్నారు. అర్హులకు అన్ని పథకాలు అందాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. వివిధ శాఖల అభివృద్ధి, వాటి పురోగతిపై, సమస్యలపై చర్చించి అధ్యయనం చేశారు. సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎంపీపీ మహిపాల్ రెడ్డి, ఎంపీడీవో మల్సూర్, వైస్ ఎంపీపీ ప్రయాగమాధవరావు, ఏవో శశాంక్, వైద్యాధికారి డా.విజయ్‌కుమార్, ఏపీవో బస్వరాజ్, ఏపీఎం బ్రహంచారి, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

అప్రమత్తంగా ఉండాలి

న్యాల్‌కల్, మార్చి 19: లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి పొరుగు రాష్ర్టాల నుంచి తెలంగాణలోకి వచ్చే వాహనాలను పకడ్బందీగా తనిఖీలు చేయాలని జహీరాబాద్ రెవెన్యూ డివిజన్ అధికారి రాజు అన్నారు. మంగళవారం మండలంలోని తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని హుస్సే ల్లి, మల్గి గ్రామాల సమీపంలో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్‌పోస్టుల వద్ద వాహనాల రాకపోకల నమోదు, స్వాధీనం చేసుకున్న నగదు, మద్యం తదితర రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాతుడూ అంతరాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద 24గంటల ప్రత్యేక నిఘ ఉంచి, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ర్టాల నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణం గా తనిఖీలు చేయాలన్నారు. ఆయా రాష్ర్టాల నుంచి డబ్బు, మద్యం, విలువైన వస్తువులు రాకుండా కట్టడి చేయాలన్నారు. ఆయనవెంట మండల తహసీల్దార్ రాజిరెడ్డి, హద్నూర్ ఎస్ఐ రామానాయుడు, ఏఎస్ఐ ఎక్బాల్ ఉన్నారు.

హుస్సేల్లి గ్రామ శివారులోని తెలంగాణ-కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసుల అధికారులు, సిబ్బంది

వీరభద్రస్వామి హుండీ లెక్కింపు

గుమ్మడిదల, మార్చి 19: జిల్లాలోని సుప్రసిద్ధ శైవ క్షేత్రమైన బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయ హుండీని లెక్కించారు. మంగళవారం వీరన్నగూడెంలోని బొంతపల్లి భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయ హుండీలను దేవాదాయ, ధర్మాదాయ శాఖ పర్యవేక్షకులు సారా శ్రీనివాస్, ఈవో శశిధర్‌గుప్తా సమక్షంలో లెక్కించారు. హుండీ ఆదాయం రూ.13లక్షల 12 వేల 268 వచ్చినట్లు ఈవో తెలిపారు. అన్నదాన ప్రసాద ఆదాయం రూ.70 వేల 55 వచ్చినట్లు తెలిపారు. హుం డీ ఆదాయాన్ని రాజరాజేశ్వరి సేవాసమితి కామారెడ్డి బృందంతో లెక్కించారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ వేణు, మాజీ ఉపసర్పంచ్‌లు లక్ష్మీనారాయణ, కుమార్ హాజరయ్యా రు. కార్యక్రమంలో ఆలయ సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు రవీంద్రమూర్తి, అర్చకులు పాల్గొన్నారు.

బోరంచ ఆలయ హుండీ లెక్కింపు

మనూరు, మార్చి 19: మండలంలోని బోరంచ నల్లపోచమ్మ ఆలయ హుండీని మంగళవారం లెక్కించామని ఈవో మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి జాతర తర్వాత హుండీని లెక్కించామన్నారు. హుండీ ఆదాయం రూ.7లక్షల 34వేలు వచ్చిందన్నారు. వచ్చిన ఆదాయాన్ని ఆలయ బ్యాంకు ఖాతాలో జమ చేసి ఆలయ అభివృద్ధికి ఖర్చు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయంలో హుండీని లెక్కిస్తున్న భక్తులు

ప్రింట్‌మీడియా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా విఠల్

రాయికోడ్, మార్చి 19: మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా ఒగ్గు విఠల్‌ను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న జర్నలిస్టులకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. సమావేశంలో మండల ప్రింట్‌మీడియో ప్రెస్‌క్లబ్ సభ్యులు విఠల్‌రావు, పెంటయ్య, సాయిబాబా, గోపాల్, రాజు, శంకర్, ప్రశాంత్, హనుమంతు, బాబురావు ఉన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

నారాయణఖేడ్, మార్చి 19: ఆకాల వర్షా ల వల్ల జొన్నపంట దెబ్బతిని నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని నారాయణఖేడ్ మాజీఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నష్టపోయిన జొన్న రైతులకు ఎకరాకు రూ. 20వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వర్షం,వడగండ్ల కారణంగా జొన్న పంట సాగుకు పెట్టిన పెట్టుబడి సైతం వచ్చే పరిస్థితి లేదన్నారు. పిడుగుపాటుకు మృతి చెందిన వారికి రూ. 10లక్షల పరిహారం మిచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అండగా ఉంటాం

రామచంద్రాపురం, మార్చి19: టీఎస్ మోడల్ స్కూల్ విద్యార్థులకు అండగా ఉంటామని పేస్విఫ్ టెక్నాలజీస్ సంస్థ ఉద్యోగులు అన్నారు. మంగళవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల గ్రామంలో ఉన్న టీఎస్ మోడల్ స్కూల్‌లో విద్యార్థినుల సౌకర్యార్థం ఉద్యోగులు రూ. 36వేలతో శానిటరీ న్యాప్‌కిన్ వెండింగ్ మిషిన్‌ను అందజేసి విద్యార్థులందరికీ చాక్లెట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాంప్రసాద్ మాట్లాడుతూ పేస్విఫ్ టెక్నాలజీస్ సంస్థ ఉద్యోగులు మోడల్ స్కూల్‌కకు సహకారం అందజేయడం చాలా సంతోషంగా ఉన్నదన్నారు.

స్కూల్‌కు శానిటరీ న్యాప్‌కిన్ వెండింగ్ మిషిన్‌ను అందజేస్తున్న పేస్విఫ్ టెక్నాలజీస్ సంస్థ ఉద్యోగులు

ఫెస్టివల్ కమిటీ నియామకం

హత్నూర, మార్చి19: మండలంలోని శేర్కాన్‌పల్లి పలుగుపోచమ్మ ఆలయ ఫెస్టివల్ కమిటీని నియమిస్తూ దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆలయ ఈవో శశిధర్ తెలిపారు. ఫెస్టివల్ కమిటీ చైర్మన్‌గా శేర్కాన్‌పల్లి గ్రామానికి చెందిన కమ్మరి నరసింహాచారి, సభ్యులుగా సందిల లక్ష్మణ్ గౌడ్, కోటగళ్ల స్వరూప, కనిగిరి స్వామి, చిట్టిపటేళ్ల దశరథ్, గుడుగ శంకరయ్య,ఎక్స్‌అఫీసియో సభ్యుడిగా మడపటి శ్రీకాంత్‌లను నియమించారు. ఏప్రిల్ 4నుంచి 8వరకు నిర్వహించనున్న ఆలయ ఉత్సవాలను విజయవంతం చేయడానికి ఫెస్టివల్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు.

ఉల్లంఘిస్తే చర్యలు

నారాయణఖేడ్, మార్చి 19: ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో ఎన్నికల నియమావళి అమలులో ఉందని, నియమావళిని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని నారాయణఖేడ్ ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్యలు చేయడం, రాజకీయ పోస్టులు పెట్టడం చేయరాదన్నారు. బెల్ట్‌షాపుల్లో మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పరిమితికి మించి నగదు పట్టుబడితే తగిన ఆధారాలు చూపాల్సి ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళికి లోబడి పనిచేయాలని సూచించారు.

ఇంటింటి సర్వే

బొల్లారం, మార్చి 19: మున్సిపాలిటీలో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఈనెల 11 నుంచి అధికారులు, వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టినట్లు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం అధికారి రాధిక తెలిపారు. మంగళవారం పలు కాలనీల్లో సూపర్‌వైజర్ సమీ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు సర్వే నిర్వహించి వివరాలు సేకరించారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లతో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు డాక్టర్ రాధిక తెలిపారు. ఈనెల 24వ తేదీ వరకు ఇంటింటి సర్వే కొనసాగుతుందన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

అందోల్, మార్చి 19 : మండల పరిధిలోని రెండో తిరుపతిగా పేరుగాంచిన కిచ్చనపల్లిలోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అలయ నిర్వాహకులు లక్ష్మణాచారి మాట్లాడుతూ స్వామివారి కల్యాణ మహోత్సవానికి వేలాదిగా భక్తులు తరలిరావడం సంతోషంగా ఉన్నదన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గుప్తా, మాజీ ఎంపీపీ రామగౌడ్, జోగిరెడ్డి, వెంకటేశం, మాణయ్య, పాల్గొన్నారు.

రేణుకాఎల్లమ్మ జాతర

జిన్నారం, మార్చి 19: జిన్నారం పంచాయతీ పెద్దమ్మగూడెంలో నాలుగు రోజులుగా మల్లన్న జాతరను వైభవంగా నిర్వహిస్తున్నారు. జాతరలో భాగంగా మంగళవారం జిన్నారం నుంచి ఎల్లమ్మ ఆలయం వరకు ఘటం ఊరేగింపుగా తీసుకొచ్చారు. సాయంత్రం అమ్మవారికి బోనాలు సమర్పించారు. జాతర చివరిరోజు కావడంతో గ్రామస్తులతోపాటు జిన్నారం, నర్రిగూడెం గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

జిన్నారం : ఘటాన్ని ఆలయానికి తీసుకొస్తున్న భక్తులు

వృద్ధులపై వివక్ష చూపించొద్దు

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు

సంగారెడ్డి/అమీన్‌పూర్, మార్చి19: వృద్ధులపై వివక్ష చూపించొద్దని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు అన్నారు. మంగళవారం జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు ఆదేశాల ప్రకారం అమీన్‌పూర్‌లోని ది నెస్ట్ వృద్ధాశ్రమంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులను తల్లిదండ్రుల్లాగా జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. వృద్ధుల బాగోగులు, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చట్టాలపై అవగాహన కల్పించారు. ఎలాంటి సమస్యలున్నా లీగల్ సర్వీసెస్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ది నెస్ట్ వృద్ధాశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న హనుమంతరావు

గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటు

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 19: పార్లమెంట్ ఎన్నికల నియమాళి అమలులో భాగంగా గ్రీవెన్స్ కమిటీని ఏర్పాటు చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి మంగళవారం తెలిపారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల తనిఖీల్లో పట్టుబడిన నగదును విడిపించుకోవడానికి గ్రీవెన్స్ కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రూ. 50 వేలకు పైగా నగదు తీసుకెళ్లేటప్పుడు సంబంధిత ధృవపత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. తనిఖీల్లో రూ. 10లక్షలకు పైగా పట్టుపడితే ఐటీ శాఖకు సమాచారం అందిస్తామని పేర్కొన్నారు. 9281487272, 6300614057, 7799934149ను ఏదైనా సమస్యలు ఉత్పన్నమైతే సంప్రదించవచ్చున్నారు.

నల్లబ్యాడ్జిలతో విధులకు హాజరు

హత్నూర, మార్చి19: నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు ఎంపీవోపై జరిగిన దాడికి నిరసనగా ఉద్యోగులు మంగళవారం నల్లబ్యాడ్జిలు ధరించి విధులకు హాజరయ్యారు. విధి నిర్వహణలో వున్న ఎంపీవోపై అకారణం గా దాడిచేసిన ఎంపీపీపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పార్టీ గేట్లు కాదు.. హామీలు అమలు చేయండి

ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

కోహీర్, మార్చి19: కాంగ్రెస్ పార్టీ గేట్లు ఎత్తితే బీఆర్ఎస్ ఖాళీ అవుతుందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొనడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు విమర్శించారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ గేట్లు ఎత్తడం కాదు.. ముందుగా ఎన్నికల్లో ఇచ్చిన హామీల గేట్లను తెరవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలు అమలు చేసి, అప్పుడు మాట్లాడాలన్నారు. కేసీఆర్ పాలనలో పచ్చని పంట పొలాలు ఉంటే.. కాంగ్రెస్ పాలనలో పంటలు ఎండిపోతున్నాయన్నారు. అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. తాను పార్టీ మారే ప్రసక్తేలేదని తేల్చి చెప్పారు.

కాంగ్రెస్‌లో చేరే ప్రసక్తే లేదు

కాంగ్రెస్ పార్టీలో చేరే ప్రసక్తే లేదని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు స్పష్టం చేశారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు సోషల్ మీడియాలో తప్పుడు కథనాలు వచ్చాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సోదరుడు సంగారెడ్డి జైలులో ఉన్నాడని తెలిసి అతడిని కలిసేందుకు సంగారెడ్డికి వెళ్లానని చెప్పారు. సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ క్యాంపు కార్యాలయంలో కలిశామన్నారు. జైలులో ఉన్న అతడిని పరామర్శించేందుకు పోలీసులు అనుమతినివ్వలేదని చెప్పారు. దీంతో జహీరాబాద్ చేరుకున్నానన్నారు. కానీ మీడియా కథనాలతో తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. తాను ఎట్టి పరిస్థితుల్లోనూ బీఆర్ఎస్‌ను విడేదిలేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన 420హామీలను వెం టనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

మనూరు, మార్చి 19: పౌష్టికాహారంతోనే ఆరోగ్యంగా ఉంటామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జమున అన్నారు. మంగళవారం మండల పరిధిలోని శల్గిర గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ్‌పక్వాడ్ కార్యక్రమంలో గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో లభించే పౌష్టికాహారం పిల్లల ఎదుగుదలను తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వీనాకుమారి, శైలజ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

హత్నూర, మార్చి19: హత్నూరలో అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం విద్యార్థులు, చిన్నారులకు పౌష్టికాహారం తీసుకోవాలని అవగాహన కల్పించారు. పోషణ పక్షం దినోత్సవాల్లో భాగంగా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రత్న, సంగమేశ్వరి, పద్మ, అనూష, విజయలక్ష్మి పాల్గొన్నారు.

పోషణ్ పక్వాడ పక్షోత్సవాలు

గుమ్మడిదల, మార్చి 19: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని వీరన్నగూడెం అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ పక్షోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్ల ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు పోషకాహారం ఉపయోగాలను వివరించారు. తల్లులకు ప్రీస్కూల్ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు భూలక్ష్మి, ప్రమీల, సునీత, శైలజ, స్వప్న, వరలక్ష్మి పాల్గొన్నారు.

రాయికోడ్‌లో...

రాయికోడ్, మార్చి 19: అంగన్‌వాడీ ఆధ్వర్యంలో నిర్వహించే పోషణ్ పక్వాడ కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం రాయికోడ్‌లోని మొదటి అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ సక్కుబాయి అధ్వర్యంలో గ్రామంలోని మహిళలకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు.

ఎల్‌వోసీ అందజేత

హత్నూర, మార్చి19: అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు దవాఖానలో చికిత్స నిమిత్తం ఆర్థిక సాయం కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్న బాధిత కుటుంబానికి మంజూరైన ఎల్‌వోసీని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మంగళవారం అందజేశారు. మండలంలోని రెడ్డిఖానాపూర్ గ్రామానికి చెందిన బల్లి నాగరాణికి మంజూరు చేసిన రూ.లక్ష ఎల్‌వోసీని ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు వీరేశం ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

గోడకూలి కార్మికుడు మృతి

పటాన్‌చెరు, మార్చి 19: పరిశ్రమలో గోడ కూలి కార్మికుడు మృతి చెందిన ఘటన పాశమైలారం పారిశ్రామికవాడలో చోటు చేసుకుంది. పటాన్‌చెరు మండలం పాశమైలారంలోని ఐటీడబ్ల్యూ కెమిన్ పరిశ్రమలో సిర్గాపూర్ మండలం పోచాపురం గ్రామానికి చెందిన గోపాల్(40) ముత్తంగిలో నివసిస్తూ ఐటీడబ్ల్యూ కెమిన్‌లో డ్యూటీ చేస్తున్నాడు. మంగళవారం పరిశ్రమలో పనిచేస్తున్న సమయంలో కంపెనీ గోడ కూలి గోపాల్‌పై పడింది. ఘటనలో తీవ్రగాయాలకు గురైన గోపాల్ అక్కడికక్కడే మృతి చెందాడు. బీడీఎల్ పోలీసులు మృతదేహాన్ని పంచనామా కోసం ఏరియా దవాఖానకు తరలించారు.

యువకుడు అదృశ్యం

బొల్లారం, మార్చి 19 : యువకుడు జాబ్‌కు అని వెళ్లి అదృశ్యమైన ఘటన బొల్లా రం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలాజీనగర్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే బాలాజీనగర్‌కు చెందిన కొత్తగళ్ళ లవన్‌కుమార్(21) ఈనెల 11వన జాబ్‌కు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. ఆందోళన చెందిన తల్లిదండ్రులు 12న పోలీసులను ఆశ్రయించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పదిరోజులు గడుస్తున్నా జాడ తెలియకపోవడం తో ఆందోళన చెందిన తండ్రి గంగాధర్ తన కొడుకు ఫొటోను సోషల్ మీడియాలో పోస్ట్ చేసి ఆచూకీ తెలిపిన వారికి రూ.50 వేల నగదు బహుమానంగా అందిస్తానన్నారు. ఆచూకీ తెలిస్తే 9848473320 నంబర్లో సంప్రదించాలని కోరారు.

PUBLIC NOTICE

To whomsoever concerned, of the general public is hereby informed that our clients 1. Mr. LENKALAPALLY PREM CHAND YADAV S/o. LENKALAPALLY MOGILI aged about: 32 years, Occupation : Pvt. Employee, 2. Mrs. CHITTIBOINA SWETHA W/o. LENKALAPALLY PREM CHAND YADAV aged about: 26 years, Occupation : Pvt. Employee, both are residing at H.No.2-26, Mondrai, sangem, Warangal District-506331, T.S., are intending to purchase the below mentioned schedule property i.e. Residential Duplex House bearing no.2-81/15 PTIN No. 1244126295, Constructed on Plot No.15, in Survey Nos. 1 (1A), 1/A2 (1/AA2), 1/AA (1/AA1), 1/E, 1164/AA, 1165/A, 1165/AA, 1166, 1167, (1167/AA1), 1167/A1, 1167/A2, 1167/AA2, 1167/A3, (1167/AA3), 1167/AA4, 1167/A5, 1167/AA5 (1167/AA6), admeasuring 142 Sq. yards or 118.08 Sq. mtrs, having total built up area of 1815 Sft, (Ground Floor 822 SFT, FIRST FLOOR 846 SFT, Terrace Head Room 147 sft), roof covered with RCC, Situated at SUPRAJA HARMONEY COLONY, of Ameenpur Village & Mandal, Sangareddy district, and bounded as NORTH : PLOT NO.16 ; SOUTH : PLOT NO.14 ; EAST: PLOT NO.3 ; WEST : ROAD, from BASHETTI SRINATH S/o. LATE. B. NARAYANA, aged about 50 years, Occ: Business, R/o. H.No.3-53/3, Taranagar, Serilingampally Mandal, R.R.Dist, Hyderabad-500019, T.S., having same acquired through Will Deed bearing Document No.BKIII/3/2017, Dated: 07.01.2017, Regd. at SRO Sangareddy, thereafter the B. Narayana expired on 17/09/2021, and the said B. Srinath succeeded the property and also daughters of Late B. Narayana and B. Srinath executed MOU-CUM FAMILY SETTLEMENT & NO OBJECTION and same was validated in the District Registrar Medak at Patancheru vide Validation File No.G1/2381/2023, Dated 01/07/2023, and my clients paid the advance amount to B. Srinath and both parties entered into an agreement of sale on Dated 25.01.2024, and our clients proceeds for registration. Hence, whomsoever of the public having rights/ claiming to have rights of any kind including that of mortgages, easements, assignments, alienations, gifts, leases, encumbrance, possession, interests, whether contingent or absolute, past or future etc in the above said property may file their objections, if any in writing together with supporting documents in evidence thereof, before us within 7 days from the date of this publication. Otherwise, it will be treated that there are no objections. No claims will be entertained later and our clients will proceed with the execution and registration of sale deed in respect of the above said property.

Sd/- KAMMARI SAI KUMAR, B.VIJAY KUMAR
Advocates
Office: 5-50, Chandanagar, Serilingampally Mandal, R.R.Dist,
Ph: 9652517517, 9505536771

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★ I, KATIKI SRINIVAS RAO, S/o. Katiki Laxmana, R/o. Flat No. 430B, Sri Sneha Lake View Apartments, Ramachandrapuram, Sangareddy District. In My Daughter's KATIKI AMULYA SSC Memo, My Name mentioned as KATIKI SRINIVAS, both Names KATIKI SRINIVAS and KATIKI SRINIVAS RAO belongs to me and one only.
NT-313839

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవి విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
సిద్దిపేట/గజ్వేల్/హుస్నాబాద్/మెదక్ : 80966 77663
సంగారెడ్డి/జహీరాబాద్/నారాయణఖేడ్ : 9182777658
పటాన్‌చెరు : 80966 77657